క్లుప్తంగా

21 నుంచి కుట్టు శిక్షణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 21వ తేదీ నుంచి టైలరింగ్‌లో కొత్త బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం మహిళా విభాగం ఇన్‌చార్జి పి.విజయ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికి టైలరింగ్‌లో 8 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేశామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 19వ తేదీ లోగా ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 0866 2578044, 94900 98021 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దుతా



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేటలోని 51వ డివిజన్‌ను మోడల్ తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ అన్నారు. ఆంజనేయవాగలోని వడ్డెర కల్యాణ మండపం వద్ద కొండపై భాగంలో ఐదు లక్షలతో చేపట్టిన మెట్లు, కాలువల నిర్మాణానికి రాజేష్ శనివారం కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. రాజేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మికి డివిజన్ సమస్యలు తెలిపిన వెంటనే సానుకూలంగా స్పందించి నిధుల మంజూరుకు సహకరించారన్నారు. కొండ ప్రాంతంలో మెట్ల నిర్మాణం 30 ఏళ్లుగా సరిగా జరగలేదన్నారు. ఇప్పుడు మెట్లు నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తలసేమియా వ్యాధిగ్రస్తులకు అండగా ఉండాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తలసేమియా వ్యాధిగ్రస్తులకు అందరూ అండగా ఉండాలని రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ అధ్యక్షులు బాయన బాబూజీ (బాబ్జీ) అన్నారు. క్లబ్ ఆధ్వర్యాన నగరంలోని వివిధ ఆసుపత్రుల్లో తలసేమియా వ్యాధిగ్రస్తులకు ల్యుకోసైట్లు తొలగించు బ్లడ్‌ఫిల్టర్ల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బాయన బాబూజీ మాట్లాడుతూ తలసేమియా వ్యాధిగ్రస్తులకు రోటరీ సంస్థలు నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. నగరంలో విద్యావైద్య రంగాలకు రోటరీ చేస్తున్న వివిధ కార్యక్రమాలను పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి గుండారపు శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ పిల్లా మోహనరావు, డిస్ట్రిక్ట్ కార్యదర్శి మాలపాక భాస్కర్, క్లబ్ కోశాధికారి గణేష్ సుబ్బారావు రోటరీ ప్రముఖులు నంగినేని శ్రీనివాసరావు, జీవీ రావు, షేక్ అమానుల్లా, వి.దామోదరరావు, సప్తా హాస్పిటల్ ప్రముఖులు శరత్‌చంద్ర పాల్గొన్నారు.

15న 'జయహో భారత్'



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కళలను, కళాసంస్కృతిని కాపాడుకోవడంతో పాటు చిన్నారుల్లో దేశభక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ నెల 15వ తేదీ జయహో భారత్... ప్రౌడ్ టూ బీ ఏన్ ఇండియన్ పేరుతో ఆర్ట్ కంటెస్ట్ నిర్వహిస్తున్నామని టాటోర్ లెర్నింగ్ ప్రయివేట్ లిమిటెడ్ సీఈవో పద్మలత చెప్పారు. నగరంలోని ఆ సంస్థ కార్యాలయంలో శనివారం ఆర్ట్ కంటెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. పద్మలత మాట్లాడుతూ ఫోరం ఫర్ ఆర్టిస్ట్, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం(ఎంబీవీకే) తమ సంస్థ సంయుక్త ఆధ్వర్యాన పోటీలు జరుగుతున్నాయన్నారు. సబ్ జూనియర్స్ (1, 2, 3 తరగతులు), జూనియర్స్ (4 , 5, 6 తరగతులు), సీనియర్స్ (7, 8, 9 తరగతులు) విభాగాల్లో పోటీలుంటాయని ఫోరం ఫర్ ఆర్టిస్ట్ కన్వీనర్ ఎ.సునీల్ కుమార్ తెలిపారు. ఎంజీరోడ్డులోని మాకినేని బసవన పున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకే) ఆవరణలో జరిగే కంటెస్ట్‌కు ప్రవేశం ఉచితమని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 77993 08775, 79814 35393 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

యువకుడు అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువకుడు అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. అంబాపురం పంచాయతీ పరిధిలోని పలగాని వారి వీధికి చెందిన జరుగుమల్లి కాంతరావు రైల్వేలో లోకో పైలట్. అతనికి ఇద్దరు సంతానం. కుమారుడు కార్తీక్ వర్మ(19) ఇంటర్ రెండో సంవత్సరం చదివాడు. ఇటీవల ఎంసెట్ రాయగా, ర్యాంక్ రాలేదు. బాగా చదువుకో, లేదంటే పని నేర్చుకోమని శుక్రవారం రాత్రి తండ్రి మందలించాడు. శనివారం ఉదయం నిద్ర లేచిన కాంతరావుకు కార్తీక్ ఇంట్లో కనిపించలేదు. ఇంటి ముందు పెట్టిన బైక్ లేదు. పలుచోట్ల వెదికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ప్రగతి దారులు

- గట్టినక.. చకచకా సీసీ రోడ్ల నిర్మాణం
- అభివృద్ధికి కేరాఫ్ 'పశ్చిమం'
- కొండ ప్రాంతంలో మెట్లు, డ్రెయిన్ల నిర్మాణం



44వ డివిజన్ పార్థసారథి వీధిలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు



40వ డివిజన్ హనుమయ్య వీధిలో సీసీ రోడ్డు



45వ డివిజన్ కొండ ప్రాంతంలో నిర్మిస్తున్న మెట్లు, డ్రెయిన్లు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పశ్చిమ నియోజకవర్గం ప్రగతిబాట పట్టింది. ఇదికదా అభివృద్ధి అని ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశంసిస్తున్నారు. గట్టినక ప్రాంతంలో కోట్లాది రూపాయలతో రోడ్లు, తాగునీటి పైపులైన్లను ఏర్పాటుచేశారు.. ఏర్పాటవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రోడ్లు బాగోలేదు మహాప్రభో అంటూ మొత్తుకున్నా పట్టించుకున్న నాథుడే లేడని వారు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా గట్టినక కొండ ప్రాంతంలో దాదాపు మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన మెట్లు, డ్రెయిన్లు ధ్వంసమై నానా అగచాట్లు పడుతుంటే నాటి టీడీపీ ప్రజాప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు లేవని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధికి కేరాఫ్‌గా పశ్చిమం మారింది.

మట్టి రోడ్డు అనేది కనపడకూడదు

నియోజకవర్గంలో మట్టి రోడ్డు అనేది కనపడకూడదన్న లక్ష్యంతో వివిధ డివిజన్ల పర్యటనల్లో ఎక్కడ మట్టి రోడ్డు కనపడినా వెంటనే ఇంజినీరింగ్ అధికారులను పిలిచి ఎస్టిమేట్లు వేయించటం, ఆ వెంటనే నిధులు మంజూరు చేయడానికి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు కృషి చేశారు. అందుకు గట్టినక ప్రాంతంలోని పలు డివిజన్లలో మెయిన్ రోడ్లతోపాటు అంతర్గత రోడ్లు కూడా సిమెంట్ రోడ్లు వేయించటం, వాటికి అనుసంధానంగా కల్వర్ట్‌లు నిర్మించటమే నిదర్శనమని ఆయా ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాదిరిగా తారు రోడ్లు వేసిన అనంతరం ఏదో ఒక పనిమీద రోడ్లలో తవ్వేయటం, ఆనక రిస్టోరేషన్ సరిగ్గా చేయకుండా వదిలేయటం కాకుండా సీసీ రోడ్లు నిర్మాణానికి ముందుగానే యూజీడీ కనెక్షన్లు ఇవ్వటం, తాగునీటి పైప్‌లైన్లు వేస్తున్నారు.

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు మేమే..

గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, శిలాఫలకాలు వేయటం తప్ప పట్టించుకున్న దాఖలాలు లేవని నియోజకవర్గ ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు మేమే..ప్రారంభోత్సవాలు మేమే అని పలు సందర్భాల్లో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు చెప్పటం వాస్తవానికి ప్రతిబింబంగా ఉందంటున్నారు ప్రజలు. నగరాభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడమే కాకుండా అందుకు అవసరమైన నిధులుకూడా విడుదల చేస్తున్నారని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

ప్రభుత్వ రంగ బ్యాంకులను రక్షించుకుందాం

కెనరా బ్యాంకు ఉద్యోగుల సంఘ జాతీయ సమావేశంలో ఎంపీ బినయ్ బిశ్వం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ రంగ బ్యాంకులను రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని పార్లమెంటు సభ్యులు బినయ్ బిశ్వం అన్నారు. విజయవాడలో మూడు రోజుల పాటు జరగనున్న కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ జాతీయ 26వ సర్వసభ్య సమావేశాలు శనివారం ప్రారంభమయ్యాయి. పోరాటాల పురిటిగడ్డ విజయవాడలో 1974లో సమావేశాలు జరగ్గా, 49 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు జరుగుతున్నట్లు ఆ సంఘ కేంద్రకమిటీ అధ్యక్షులు ఎంఎస్ శ్రీనివాసన్ తెలిపారు. సమావేశాల్లో ముఖ్యఅతిథులుగా ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం, కార్యదర్శి బీఎస్ రాంబాబుతో పాటు కెనరాబ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సత్యనారాయణరాజు, జనరల్ మేనేజర్ పి రవివర్మ, ఉపాధ్యక్షుడు జెపీ శర్మ, కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.శ్రీకృష్ణ పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ 'ఏ' గ్రేడ్



ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రతిష్టాత్మకమైన నాక్ ఏ గ్రేడ్ లభించింది. 2017లో నాక్ బీ ప్లస్ గ్రేడ్ ఉండగా ఇప్పుడు అత్యుత్తమ పనితీరు, మెరుగైన వసతుల కల్పన విద్యాబోధనలతో ఏ గ్రేడ్ సొంతమైంది. 86 సంవత్సరాల చరిత్ర కలిగిన ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ ఏగ్రేడ్ గుర్తింపు రావడంపై కళాశాల సిబ్బంది, పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిష్టాత్మకమైన ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో మారుతున్న కాలానుగుణంగా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో వసతులు కల్పించారు. ఇప్పటికే అటానమస్ హోదా కలిగిన కళాశాలలో వర్చువల్ క్లాస్ రూమ్‌లతో పాటు, సీసీ కెమెరాలు, అత్యాధునిక ల్యాబ్, లైబ్రరీలను ఏర్పాటు చేశారు. కళాశాలలో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో ఇటీవల జరిపిన నాక్ పర్యటనలో ఏ గ్రేడ్ లభించింది.

సెప్టెంబర్ 8 నుంచి శ్రీ వైభవ మహాలక్ష్మీయాగం



యాగం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): దేశ సంరక్షణ, సౌభాగ్యం, ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ శ్రావణమాసం నాలుగో శుక్రవారం సెప్టెంబర్ 8 నుంచి 13వ తేదీ వరకు సింగ్‌నగర్‌లోని బసవ పున్నయ్య స్టేడియంలో శ్రీ వైభవ మహాలక్ష్మీయాగం నిర్వహించనున్నట్లు యాగం కన్వీనర్ కె.ఎస్. దీక్షితులు పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఓకే సిల్క్ ప్రతినిధి వర్ల శ్యాంప్రసాద్ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దీక్షితులు మాట్లాడుతూ శ్రీ శివజ్ఞాన పీఠాధిపతులు శివాచార్యస్వామి సమక్షంలో శ్రావణ శుక్రవారం నుంచి మొదలయ్యే ఈ యాగంలో రోజూ మహిళలతో సామూహిక కోటి రేణువుల కుంకుమార్చన, హోమ కార్యక్రమాలు, వెండి కమల పుష్పార్చన, సాయంత్రం భక్తులతో సామూహిక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం యాగ స్థలం పురవీధుల్లో ఊరేగింపు, స్వామి వారి అనుగ్రహ భాషణం జరుగుతుందన్నారు. యాగం చివరి రోజున ఉదయం 11.25 గంటలకు యాగ పూర్ణాహుతి నిర్వహించి మధ్యాహ్నం భక్తులకు యజ్ఞ ప్రసాదం, అన్న ప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగలింగం శివాజీ, పి.శ్యాంప్రసాద్, సుదర్శన్, హైమవతి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న లయోల సిబ్బంది

గుణదల (విజయవాడ తూర్పు): తెలుగు భాష ఔన్నత్యాన్ని పెంపొందించడానికి తమ కళాశాల కృషి చేస్తుందని ఆంధ్ర లయోల కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ జీఏపీ కిషోర్ అన్నారు. ఆయన చాంబర్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో రాజరాజ నరేంద్రుడి పట్టాభిషేక సహస్రాబ్ది మహోత్సవ కరపత్రాలను విడుదల చేశారు. ఫాదర్ కిషోర్ మాట్లాడుతూ తెలుగు భాష గొప్పదనాన్ని విస్తరింపజేయడానికి వేంగి చాళుక్య ప్రభువు రాజరాజ నరేంద్రుడు విశేషమైన కృషి చేశాడని తెలిపారు. ఆంధ్ర మహాభారత రచనకు నన్నయ్యను ప్రోత్సహించి ఆది కావ్య అవతరణకు నాంది పలికారని పేర్కొన్నారు. తెలుగు వారికి సదా స్మరణీయుడు రాజరాజ నరేంద్రుడి పట్టాభిషేకం క్రీ.శ.1022 ఆగస్టులో జరిగినట్లు చరిత్రకారులు నిర్ధారించారని వివరించారు. ఆ పట్టాభిషేకం జరిగి వెయ్యి సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఆంధ్ర లయోల కళాశాల సహస్రాబ్ది మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. సెప్టెంబరు తొమ్మిదో తేదీ ఆంధ్ర లయోల కళాశాలలో సహస్రాబ్ది ఉత్సవాన్ని జరుపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి డాక్టర్ కోలా శేఖర్, చరిత్ర విభాగాధిపతి మువ్వా శ్రీనివాసరెడ్డి, తిరువూరు ప్రభుత్వ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ విజయవానందరాజు, కోనుకొల్లు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ-98 అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలి

ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డీఎస్సీ-98 అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ ఈనెల 16న విజయవాడలో మహాధర్నా చేపట్టనున్నట్లు 1998 డీఎస్సీ పోస్టుల సాధన పోరాట కమిటీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎమ్మెల్సీ లక్ష్మణరావు, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించి 4072 మందికి ఓపెన్ మెరిట్ పద్ధతిలో పోస్టులు కేటాయించారన్నారు. మిగిలిన వారందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. డీఎస్సీ-98 అభ్యర్థులకు పీడీఎఫ్ ఎమ్మెల్సీలు మద్దతిస్తారన్నారు. సమావేశంలో కమిటీ రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, పాదిలి రమణ, రమేష్ ,రత్నం పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అధ్యక్షుడిగా రాజుడేవిడ్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): లయన్స్ క్లబ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అధ్యక్షుడిగా, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్‌గా దొంతలూరి రాజుడేవిడ్ నియమితులయ్యారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో క్లబ్ నిర్వహించిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ పర్వతనేని సుభాష్ బాబు, మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ వంక రవీంద్రనాథ్, ఎల్‌సీఐఎఫ్ ఏరియా లీడర్ అంబటి సుధాకర్‌రెడ్డి నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు. 16 ఏళ్లగా లయన్స్ క్లబ్‌లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన రాజుడేవిడ్‌ను ఒకేసారి రెండు పదవులు వరించడంపై తోటి సభ్యులు అభినందించారు.

పట్టు సాధిస్తేనే విజయావకాశాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు కోర్సులపై పట్టు సాధిస్తేనే విజయావకాశాలు సొంతమవుతాయని వేద గేట్ అకాడమీ డైరెక్టర్ వేదాంతం ఎస్‌వీఎస్‌బీఎస్ శర్మ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో శనివారం 'ఇంజినీరింగ్ ద్వారా ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు'పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో వివిధ అంశాలలోని కాన్సెప్ట్‌లను వినియోగించి చిన్నచిన్న ఎలక్ట్రికల్ సర్క్యూట్లను విద్యార్థులు తయారు చేయవచ్చన్నారు. కేవలం తరగతి గది బోధనకు పరిమితం కాకుండా విద్యార్థులు పరిశోధనాత్మకంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి పిజలక్ష్మణస్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ జె. లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలి శాస్త్రి, ఈఈఈ విభాగాధిపతి శేఖర్ సునీల్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులు పరిరక్షించుకోవాలి



విజయవాడ కల్చరల్: మానవ హక్కులను పరిరక్షించుకోవాల్సిన అవసరముందని నేషనల్ యాంటీ క్రైం అండ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు జాన్ శ్యాముల్ కిమ్ జే అన్నారు. గాం. దీనగర్ హనుమంతరాయ మినీ హాల్లో శనివారం సంస్థ ఆధ్వర్యంలో ఆవిర్భావ సభ జరిగింది. ఆయన మాట్లాడుతూ సమాజంలో అందరూ సమానమే అన్నారు. కార్యక్రమలో జాతీయ గౌరవ అధ్యక్షుడు మద్దులేటి, జాతీయ గౌరవ కార్యదర్శి గంధం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. సభ్యులు మణిపూర్ దారుణ కాండకు నిరసనగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

పటమట(విజయవాడతూర్పు): మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని కేఎల్ యూనివర్సిటీ అసోసియేట్ డీన్ డాక్టర్ పి.పార్థసారథి అన్నారు. స్టెల్లా కళాశాల ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఫాస్ఫర్స్, సింథసిస్, క్యారెక్టజేషన్-అప్లికేషన్ అంశంపై వర్క్‌షాప్ జరిగింది. ఆయన మాట్లాడుతూ నానో టెక్నాలజీ ప్రపంచ వ్యాప్తంగా పేరుందని, దీని సాయంతో నూతన ఆవిష్కరణలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులు దీనిపై అవగాహన పెంచుకుని కెరీర్ మలచుకోవాలని చెప్పారు. వర్క్‌షాప్‌లో లిక్విడ్ క్రిస్టల్, మెటీరియల్ యాంటినా డివైజ్‌లపై చర్చించారు. కార్యక్రమంలో ఏఎన్‌యూ నానోటెక్నాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ గిరిధర్, ఏయూ ప్రొఫెసర్ రామకృష్ణ నాంచారరావు, కళాశాల ఫిజిక్స్ విభాగం అధ్యాపకులు డాక్టర్ లిటిల్ ఫ్లవర్, పాల్గొన్నారు.

రేపు మాస శివరాత్రి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో 14 తేదీ సోమవారం శ్రీధర్మపరిషత్ మహాసంస్థాన్ ఆధ్వర్యాన మాస శివరాత్రి పూజలు నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రుద్రాభిషేకం, ఇతర ప్రత్యేక పూజలు జరుగుతాయని పేర్కొన్నారు.

జయహో జగజ్జనని



దుర్గగుడిలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): జయహో జగజ్జనని అంటూ భక్తజనం కనకదుర్గమ్మను కనులారా దర్శించుకుని మనసారా ప్రార్థించారు. రెండో శనివారం, ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రికి భక్తుల తాకిడి పెరిగింది. సర్వ దర్శనానికి రెండు గంటల సమయం పట్టగా, రద్దీ నేపథ్యంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఇన్‌చార్జ్ ఈవో కోటేశ్వర రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆర్జిత సేవల్లో ఉభయదాతలు

అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీహోమాల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి అనుమతించారు. మరో వైపున ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వ దర్శనంతో పాటు రూ. 100, రూ. 300,రూ. 500 టికెట్లు కొనుగోలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. రద్దీ నేపథ్యంలో అమ్మవారికి భక్తులు సమర్పించే చీరల కౌంటర్‌ను చైర్మన్ కర్నాటి రాంబాబు తనిఖీ చేశారు. భక్తులు ఇచ్చిన ప్రతి చీరకు తప్పని సరిగా రసీదు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు.

కష్టజీవులకు అండగా జగనన్న ప్రభుత్వం



చర్మకారులకు గొడుగులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కష్టజీవులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని ప్లానింగ్ బోర్డు వైస్‌చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. లిడ్ క్యాప్ డైరెక్టర్ ఎం.ఝాన్సీరాణి ఆధ్వర్యాన నగరంలోని చర్మకారులకు గొడుగులు పంపిణీ కార్యక్రమాన్ని సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని ఎమ్మెల్యే విష్ణు కార్యాలయంలో శనివారం నిర్వహించారు. విష్ణు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో డీబీటీ ద్వారా 46.76 లక్షల మంది మాదిగలకు నేరుగా రూ.16,650 కోట్ల లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. ఇవికాక నాన్ డీబీటీ ద్వారా మరిన్ని ప్రయోజనాలు చేకూరుస్తున్నట్లు వెల్లడించారు. నగరంలోని చర్మకారుల సమస్యలను గుర్తించి వారు ఎండకు, వానకు ఇబ్బంది పడకుండా గొడుగులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. నేతలు కంభగల్ల రాజు, కోలా శాంతకుమారి, కిషోర్, ఆంబోజి శ్రీనివాస్, డి.కోటేశ్వరరావు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ఫీడ్‌బ్యాక్ ఇవ్వండి



మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్ కోరారు. ఆయన శనివారం 10వ డివిజన్ సాయిబాబాగుడి రోడ్డులోని 43వ వార్డు సచివాలయ పరిధిలో, 8వ డివిజన్ గాయత్రి నగర్‌లోని 64వ వార్డు సచివాలయ పరిధిలో జరుగుతున్న స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 ఫీడ్‌బ్యాక్ వెరిఫికేషన్ స్వయంగా పరిశీలించారు. సచివాలయల సిబ్బంది, వలంటీర్లు స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 ఫీడ్ బ్యాక్ వెరిఫికేషన్, డోర్ టు డోర్ ఓటర్ల వెరిఫికేషన్ చేశారా లేదా అని అడిగి తెలుసుకుని వాటికి సంబంధించిన లింకులు పంపించి వారి అభిప్రాయాలను సేకరించారు. కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి, మున్సిపల్ శాఖ ఆధ్వర్యాన దేశంలోని వివిధ నగరాలకు నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో నగరపాలక సంస్థ పాల్గొంటుందని, ఈ ఏడాది జరిగే సర్వేలో నగరవాసులు తమ అభిప్రాయాన్ని ఆన్‌లైన్ ద్వారా తెలపాలని కోరారు. దీనిలో పాల్గొనేందుకు హెచ్‌టీటీపీఎస్://వీఎఫ్‌సిటీ-పీఆర్‌వో డీడాట్‌ఎస్‌బీఎంఅర్బన్‌డాఆర్‌జీ లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూడాట్‌మైజీవోవీడాట్‌ఇన్/మైజీవోవీ-సర్వే-స్వచ్ఛ్‌సర్వేక్షణ్-2023/ లింక్ ద్వారా లేదా గూగుల్ ప్లే స్టోర్/ఆప్ స్టోర్ నుంచి స్వచ్ఛత యాప్ 2023లో ఓట్ ఫర్ మై సిటీ ఆప్షన్‌లో 4 విధాలుగా ఫీడ్‌బ్యాక్ ఇవ్వవచ్చని తెలిపారు. తొమ్మిది అంశాలపై అభిప్రాయాలు తెలిపాలని వివరించారు.

విద్యార్థులు ప్రతిభావంతులుగా ఎదగాలి



సమీక్ష కార్యక్రమంలోవిద్యార్థులు

గుణదల (విజయవాడ తూర్పు): విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తూ, సామాజిక అంశాలపై అవగాహన కలిగి ప్రతిభావంతులుగా ఎదగాలని ప్రభుత్వ స్ట్రాటజిక్ అడ్వైజర్ శివశంకర్‌రెడ్డి అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన సమీక్ష-2023 శనివారం ముగిసింది. ముఖ్యఅతిథి శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో పరిస్థితులను ఆకళింపు చేసుకుని ముందుకు సాగాలన్నారు. కేవలం మార్కులే పరమావధిగా కాకుండా నూతన అంశాలను తెలుసుకుంటూ సంఘ సంస్కర్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కరెంట్ ఎఫైర్స్‌పై దృష్టి సారించి జనరల్ నాలెడ్జ్ పెంచుకోవాలని కోరారు. అనంతరం గౌరవ అతిథి సివిల్ సర్వీసెస్ అధ్యాపకుడు మేడిశెట్టి కల్యాణ్ మాట్లాడుతూ, విద్యార్థులు నూతన అంశాలను నేర్చుకుంటూ నిత్య విద్యార్థిగా ఉండాలన్నారు. డిగ్రీ తర్వాత ఏరంగంలో స్థిరపడినా నైతిక విలువలతో నడుచుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. టెక్నికల్ క్విజ్, మిస్టర్ అండ్ మిస్సెస్ సమీక్ష, సెల్ఫీ స్టార్, ట్రెజర్ హంట్, గ్రూప్‌డాన్స్‌ల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల పీజీ వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ ప్రభుదాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంద్రాగస్టుకు ఏర్పాట్లు





ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలను తెలియజేసే శకటాలను ముస్తాబు చేస్తున్నారు. మార్చ్‌ఫాస్ట్, ఇతర అంశాలపై పోలీసులు ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ